ప్రతి ఇంటా 'నవరత్నాల' వెలుగు

- 'గడప గడపలో'
  ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



గొల్లపల్లిలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

గుమ్మఘట్ట: నవరత్నాల పథకాలతో ప్రతి ఇంటా వెలుగులు నింపాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని గొల్లపల్లిలో సర్పంచ్ గౌని అనంతమ్మ అధ్యక్షతన శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ గౌని కాంతారెడ్డి, ఎంపీడీఓ నరసింహమూర్తి, ఎంపీటీసీ నాగలక్ష్మితో కలసి విప్ ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు బ్రోచర్లను అందించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విప్ మాట్లాడుతూ చంద్రబాబు గత ఐదేళ్ల పాలనలో ఎంత లబ్ధి పొందారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక నాలుగున్నర సంవత్సరాల కాలంలో ఎంత లబ్ధి పొందారో వ్యత్యాసాన్ని గమనించాలన్నారు. ప్రజలకు అందాల్సిన ప్రజాధనాన్ని టీడీపీ నాయకులు గతంలో లూటీ చేసి పందికొక్కుల్లా దాచుకున్నారన్నారు. పలు కేసుల్లో ఇరుక్కుని దొంగలా దొరికిన చంద్రబాబును ప్రజలు నమ్మేస్థితిలో లేదన్నారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీ అడ్రస్ కనుమరుగవుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పైసా ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ఖర్చుచేశారన్నారు. మన రాష్ట్రంలో ప్రవేశపెడుతున్న పథకాలకు ఆకర్షిలవుతున్న ఇతరరాష్ట్రాల ముఖ్యమంత్రులు సైతం అమలు చేస్తున్నారన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా సచివాలయం, వలంటీర్ వ్యవస్థను నెలకొల్పి అర్హుల ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు అందజేస్తున్నారన్నారు. ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ భవాని, జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, కాంట్రాక్టర్ ఆర్తీ కాంతారెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, అగ్రిబోర్డు కమిటీ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, సర్పంచులు ఉమేష్, రాజేష్, అనిల్, ఎంపీటీసీలు ఈరన్న, గోవింద, మాజీ సర్పంచులు విజయేంద్ర, చిత్రశేఖరప్ప, ఎగ్జిక్యూటివ్ మెంబర్ బాగన్న, సచివాలయాల మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, నాయకులు నల్లక్కి తిప్పేరుద్రప్ప, నల్లక్కి పురుషోత్తం, మిద్దింటి రామప్ప, తిమ్మారెడ్డి, బంగారు అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి విగ్రహ ప్రతిష్ట



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

గుమ్మఘట్ట: మండలంలోని తాళ్లకెర గ్రామంలో పెన్నోబులేస లక్ష్మీనరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠ శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గౌని కాంతారెడ్డి, ఎంపీటీసీ గౌరమ్మ, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, రైతు ఉత్పత్తి దారుల సంఘం అధ్యక్షుడు నాగిరెడ్డి, ఉపాధ్యక్షుడు కేఎం రాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా వాల్మీకి జయంతి



వాల్మీకి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వాల్మీకులు

కళ్యాణదుర్గం: మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లులో శనివారం వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం వాల్మీకి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. బాలికలు కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. వాల్మీకి సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వాల్మీకి అడుగు జాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో వాల్మీకులు యాలేటి ఈశ్వరప్ప, భావికట్టు ఈశ్వరప్ప, ఉటంకి రామాంజినేయులు, తలారి రామన్న, ఉటంకి పెద్ద రామాంజినేయులు, పూజారి ధనుంజయ, కోడిపల్లి తిమ్మరాజు, బంద్రోతు పెద్ద మంజు, చిన్న మంజు, యాలేటి మనోహర్, తలారి రాజశేఖర్, పూజారి ఓబయ్య, తలారి అనిల్, చింతకాయల రాము, బావికట్టు మంజు, తలారి పవన్, రఘు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' భేష్



జగనన్న సురక్ష మెగా వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రజల ఇళ్ల చెంతకు, సచివాలయాలు, వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్‌ల పరిధిలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు విజయవంతంగా ముగిశాయి. క్యాంపులకు విశేష స్పందన లభించింది. చివరి రోజు శనివారం పట్టణంలోని శాంతినగర్ పెట్రోల్ బంక్ వద్ద డీఆర్‌ఎల్ భవనంలో 5వ సచివాలయం పరిధిలోని 7,8 వార్డు ప్రజలకు సురక్ష క్యాంపు నిర్వహించారు. స్పెషలిస్టు వైద్యుల పర్యవేక్షణలో అవసరమైన వారికి వైద్య పరీక్షలు చేశారు. కాగా సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 4 వరకూ పట్టణంలో సచివాలయాల వారిగా మెగా ఆరోగ్య వైద్య శిబిరాలు నిర్వహించి పరీక్షలు, ఉచితంగా మందుల పంపిణీ చేపట్టారు.

ఆలయ నిర్మాణానికి నిధులు

- ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి



ఉరవకొండ: నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మించే దేవాలయాలకు నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఒక్కో ఆలయానికి రూ.10 లక్షలు చొప్పున విడపనకల్లు మండలం డోనేకల్లు గ్రామంలోని బోగలింగేశ్వర ఆలయం, వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి పెద్దతండాలోని ఆంజనేయస్వామి ఆలయం, జే.కొట్టాలలోని మారెమ్మ ఆలయాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు టీటీడీ చైర్మన్ కరుణాకర్‌రెడ్డి నిధులు మంజురు చేశారన్నారు. అలాగే పామిడి గ్రామంలోని ఎస్సీ కాలనీలోని దుర్గమ్మ ఆలయ నిర్మాణానికి కూడా నిధులు మంజురయ్యాయన్నారు. ఈ సందర్భంగా సీఎంతో పాటు టీటీడీ బోర్డు చైర్మన్‌కు ఎమ్మెల్సీ కృతజ్ఞతలు తెలిపారు.

రైతును ఏమార్చి.. డబ్బు కొట్టేశాడు!

రాయదుర్గం: పట్టణంలోని కణేకల్లు రోడ్డులో ఉన్న స్టేట్‌బ్యాంక్ ఏటీఎంలో శనివారం ఘరానా మోసం జరిగింది. వివరాలు.. గుమ్మఘట్ట మండలం పైదొడ్డికి చెందిన గొల్ల నాగరాజు అనే రైతు ఏటీఎం వద్దకు చేరుకున్నాడు. ఈ సందర్భంగా అతడిని ఏమార్చి యువకుడు నాగరాజు ఏటీఎం మార్పు చేసిచ్చాడు. రెండు గంటల తర్వాత ఓ బంగారం దుకాణంలో రూ.75 వేలు డ్రా చేశాడు. ఆ తర్వాత కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి తదితర ప్రాంతాల్లో రూ.20 వేలు, రూ.30 వేలు ఇలా 1.14,500 డ్రా చేశాడు. డబ్బు విత్‌డ్రా అయినట్టు మెస్సేజ్ రావడంతో నాగరాజు ఆందోళనతో హుటాహుటిన బ్యాంకు వద్దకు చేరుకుని ఫిర్యాదు చేశాడు. అనంతరం సీసీ పుటేజీ ఆధారంగా నిందితుడిని పోలీసులు గుర్తించారు. త్వరలో అదుపులో తీసుకుని న్యాయం చేస్తామని సీఐ లక్ష్మణ్ణ తెలిపారు.

వర్షం కోసం సామూహిక ప్రార్థనలు



ప్రార్థన చేస్తున్న ముస్లింలు

ఉరవకొండ: అల్లా కరుణించి వర్షం కురిపించాలని కోరుతూ శనివారం స్థానిక బళ్లారి బైపాస్ వద్ద మదరసా సమీపంలోని మైదానంలో ముస్లింలు సామూహిక ప్రార్థన చేశారు. ప్రభుత్వ ఖ్వాజీ యూనుస్ ఆధ్వర్యంలో ముస్లింలు దువా చేస్తు వర్షం కురిసి పంటలు సమృద్ధిగా పండాలని కోరారు. సాగు, తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని దువా చేశారు.

ప్రత్యేక ఓటరు నమోదుకు స్పందన



రాయదుర్గంటౌన్: ఓటరు నమోదును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, ఈడీటీ సుజాత



కళ్యాణదుర్గం మండలం గోళ్ల పోలింగ్ బూత్‌లో వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీఓ రాణి సుస్మిత

రాయదుర్గంటౌన్: నియోజకవర్గవ్యాప్తంగా అన్ని పోలింగ్ బూత్‌లలో శని, ఆదివారాల్లో రెండు రోజులపాటు జరుగుతున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ సుజాత, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని బాలగంగాధర్ తిలక్ స్కూల్, జెడ్పీ బాలికోన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ప్రత్యేక ఓటరు కార్యక్రమాన్ని వారు పరిశీలించి బీఎల్‌ఓలతో వివరాలడిగి తెలుసుకున్నారు.. కొత్త ఓటు నమోదుతోపాటు మార్పులు, చేర్పులు, తొలగింపులకు దరఖాస్తులు ఇవ్వాలన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి 296 పోలింగ్ కేంద్రాల ద్వారా 372 దరఖాస్తులు స్వీకరించామన్నారు. ఆదివారం కూడా పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియ జరుగుతుందన్నారు.

కళ్యాణదుర్గం: ఓటరు జాబితా సవరణకు సంబంధించి స్పెషల్ డ్రైవ్‌ను ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ రాణి సుస్మిత అన్నారు. మండలంలోని గోళ్లలో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శనివారం పోలింగ్ బూత్ 95ను ఆర్డీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొత్త ఓటర్ల చేర్పులు, ఓటర్ల మార్పులు తదితర వాటిపై బూత్ ఆఫీసర్లను అడిగి తెలుసుకున్నారు. కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్‌లో రెండు రోజుల పాటు జరిగే స్పెషల్ డ్రైవ్‌ను అధికారులు పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆయా బూత్ లెవల్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉరవకొండ: ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని బీఎల్‌ఓలు పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మునీంద్ర సూచించారు. శనివారం స్థానిక ఎస్‌కే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ స్టేషన్‌ల పరిధిలో నిర్వహించిన ఓటరు నమోదు కార్యక్రమాన్ని అధికారులు పర్యవేక్షించారు. తహసీల్దార్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం పట్టణంలోని పలు పోలింగ్ స్టేషన్‌ల పరిధిలో చేపట్టిన కార్యక్రమాన్ని తహసీల్దార్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎన్నికల సీనియర్ సహాయకుడు వంశీకృష్ణ, వీఆర్‌ఓ పెన్నోబులేసు తదితరులు పాల్గొన్నారు.

వజ్రకరూరు: ప్రతి ఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ అనిల్‌కుమార్ సూచించారు. శనివారం మండలంలోని తట్రకల్లు వద్ద ఉన్న కస్తురిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఓటరు నమోదుపై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. అనంతరం మండలంలోని గూళ్యపాళ్యం, వజ్ర కరూరులో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ పరిశీలించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ధనలక్ష్మి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

చంద్రబాబు స్టేలన్నీ వెకేట్ చేయాలి



వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

డి హీరేహాళ్(రాయదుర్గం): టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు చేసిన ఆర్థిక నేరాలు, మోసాలు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయని, ఇప్పటివరకూ కోర్టులను అడ్డుపెట్టుకుని పలు కేసుల్లో తెచ్చుకున్న స్టేలను వెకేట్ చేయిస్తే జీవితకాలం జైలులో ఉండాల్సి వస్తుందని డి హీరేహాళ్ వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి, మార్కెట్ యార్డ్ చైర్మన్ భోజరాజ్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు రాళ్ల తిమ్మారెడ్డి అన్నారు. శనివారం ఎంపీపీ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో వారు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గతంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని చంద్రబాబు ఆర్థిక నేరాలకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. చంద్రబాబుపై నమోదైన కేసులన్నీ సమగ్రంగా విచారణ జరిపిస్తే రూ.లక్షల కోట్లు అవినీతి రుజువవుతుందన్నారు. ఇలాంటి ఆర్థిక నేరగాడికి సరైన శిక్ష జైలు గోడలేనని హితవు పలికారు. అనారోగ్య సమస్యలను కారణంగా చూపి బెయిలుపై విడుదలైన చంద్రబాబు ర్యాలీ చేయడం న్యాయవ్యవస్థలను కించపరిచినట్టేని విరుచుకుపడ్డారు. అనంతరం వారు పలు విజ్ఞప్తులతో కూడిన వినతి పత్రాని డిప్యూటీ తహసీల్దార్ బసవ కుమార్‌కు అందజేశారు. చంద్రబాబుపై నమోదైన కేసుల విచారణతో పాటు వ్యవస్థలను మేనేజ్ చేస్తూ తెచ్చుకున్న స్టేలన్నీ వెకేట్ చేసేలా దేశ అత్యున్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లింగన్న, సర్పంచులు శ్రీనివాసరెడ్డి, బోయ మల్లికార్జున, రుద్రేష్, హనుమంతరెడ్డి, పరమేష్, మల్లికేతి మల్లికార్జున, పార్టీ నాయకులు బొమ్మన్న, పెద్ద ఆంజనేయులు, ఎంపీటీసీలు శివలింగ, ఎర్రిస్వామి, గోవిందు, వైస్ సర్పంచ్ మల్లికార్జున, నాయకులు సింగాడి జగదీష్, తొండె వెంకటేశులు, గొల్ల సురేష్, పులకూర్తి చంద్ర, గన్ని గౌడ, ఖసీంపీరా పాల్గొన్నారు.

సజావుగా సామాజిక తనిఖీ ప్రజావేదిక

కళ్యాణదుర్గం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉపాధి పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదిక సజావుగా సాగింది. మండలంలో 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకూ సుమారు రూ.7.50 కోట్లకు పైగా జరిగిన ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. అంబర్స్‌మెంట్ మధుసూదన్, డ్వామా అడిషనల్ పీడీ సుధాకర్‌రెడ్డి, విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, ఏపీడీ రమేష్ నాయక్, ఎంపీడీఓ సాలమాన్, ఎస్‌ఆర్‌పీ వెంకటేష్ నాయక్‌లు వివిధ పంచాయతీలకు సంబంధించిన పనుల వివరాలను పరిశీలించారు. పలు పంచాయతీల్లో కూలీలు చేసిన పనులు, కొలతలకు వ్యత్యాసం ఉండటం, కొన్ని క్లస్టర్లలో అధికారుల సంతకాలు లేకపోవడాన్ని గుర్తించారు. అవినీతిపై త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఏపీడీ తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ రామచంద్ర, ఓబిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ భట్టువానిపల్లి ఆంజినేయులు, టీఏలు, ఎఫ్‌ఏలు, కూలీలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

కణేకల్లు: సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రజాక్‌వలి, ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. ఎంపీపీ హెచ్.సంధ్య అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జక్కలవడికి గ్రామంలో తాగునీటి పథకం వద్ద 16 హెచ్‌పీ మోటార్ ఉందని, దీని స్థానంలో 25 హెచ్‌పీ మోటార్ ఏర్పాటు చేయాలని ఎంపీటీసీలు వెంకట్రామిరెడ్డి, హనుమంతరెడ్డి సమావేశం దృష్టికి తీసుకురాగా... విప్ కాపు రామచంద్రారెడ్డి ఇది వరకే తన దృష్టికి తెచ్చారని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఏఈఈ శంకర్‌నాయక్ సమాధానమిచ్చారు. గోపులాపురం, యర్రగుంట, పులచెర్ల తదితర గ్రామాల్లో కరెంటు సమస్యలు పరిష్కరించాలని సభ్యులు అధికారుల దృష్టికి తెచ్చారు. సమావేశంలో ప్రజాప్రతినిధుల భర్తలు పెత్తనం చెలాయిస్తూ ప్రతి అంశంపై అధికారులపై ఒంటికాలుపై లేచి దుమ్మెత్తిపోయడంపై అధికారులు ఓకింత అసహనానికి గురయ్యారు. జోక్యం చేసుకున్న ఎంపీడీఓ కేవలం సభ్యులు మాత్రమే మాట్లాడాలని, వారి తరపున ఎవరూ మాట్లాడొద్దన్నారు. వైస్ ఎంపీపీ లీలావతి, ఎంఈఓ భవానీశంకర్, డాక్టర్లు మృదుల, నిరీష, ఏఓ శ్రవణ్‌కుమార్, పీఆర్ జేఈ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి పౌరులుగా ఎదగాలి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి సుభాన్

కళ్యాణదుర్గం: విద్యార్థులు మంచి పౌరులుగా ఎదగాలని కళ్యాణదుర్గం జూనియర్ సివిల్ జడ్జి సుభాన్ సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ, జాతీయ సేవా పథకం రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థుల హక్కులు, విధులు, చట్టాలపై వివరించారు. ముఖ్యంగా రైట్స్...రెమిడీ...రెడ్రెసల్ (ఆర్‌ఆర్‌ఆర్) విధానంపై విద్యార్థులకు క్షుణ్ణంగా తెలియజేశారు. మంచి పౌరులుగా ఎదిగి తల్లిదండ్రులు, గ్రామానికి , కళాశాలకు మంచి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జయరామిరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవేంద్ర, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం డాక్టర్ శ్రీధర్, అధ్యాపకులు పరమేష్, గురుమోహన్, న్యాయవాదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు సంఘంలో సభ్యులుగా చేరండి

కుందుర్పి: మండలంలో నూతనంగా ఏర్పాటు చేసిన కుసుమగిరి రైతు ఉత్పత్తి దారుల సంఘంలో రైతులు సభ్యులుగా నమోదు చేసుకోవాలని ఆసంఘం డైరెక్టర్లు సుదర్శన్‌రెడ్డి, మల్లికార్జున, నరసింహమూర్తి తదితరులు కోరారు. రూ.1,200 సభ్యత్వం చెల్లించి సభ్యులుగా చేరితే కేంద్ర ప్రభుత్వం కామన్ సర్వీస్ సెంటర్ సహకారంతో రూ.2 లక్షలు భీమా సౌకర్యం కల్పిస్తుందన్నారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా 70 మంది సభ్యులుగా చేరారన్నారు. కదరంపల్లి, మలయనూరు, మహంతపురం తదితర పంచాయతీల్లో సంఘం పర్యవేక్షణలో మునగ, దానిమ్మ, సపోటా వంటి పంటలను సేంద్రియ పద్ధతుల ద్వారా సాగు చేయించినట్లు సీఎస్సీ ఆర్గనైజర్ నరసింహమూర్తి తెలిపారు.

హంద్రీ–నీవా కాలువ పరిశీలన

వజ్రకరూరు: జిల్లాలో హంద్రీ–నీవా కాలువ తీరు, కృష్ణా జలాల నీటి పంపింగ్, కాలువలో నీటి ప్రవాహం, చెరువులకు నీటి సరఫరా, రిజర్వాయర్లను అడిషినల్ డీజీ మాదిరెడ్డ శనివారం పరిశీలించారు. మొదట జిల్లా సరిహద్దులోని కసాపురం వద్ద ఉన్న 146వ బ్రిడ్జి వద్ద కాలువను ప్రవహిస్తున్న నీటిని పరిశీలించారు. అనంతరం రాగులపాడు ప్రధాన కాలువ, జీడిపల్లి రిజర్వాయర్ పరిశీలించారు. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ డీఈ గుప్తా, సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

లక్ష్యాల్ని అధిగమించండి

కళ్యాణదుర్గం/ఉరవకొండ: గడువులోపు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి లక్ష్యాల్ని అధిగమించాలని ఆర్డీఓ రాణి సుస్మిత సూచించారు. శనివారం కళ్యాణదుర్గంలోని కురాకుల తోట లే అవుట్‌ను హౌసింగ్ డీఈఈ శైలజతో కలసి ఆర్డీఓ పరిశీలించారు. బేస్‌మెంట్ స్థాయి కూడా మొదలుపెట్టని లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఉరవకొండ ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటి నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో ఎంపీడీఓ అమృతరాజ్ సమీక్ష నిర్వహించారు. కొలిమి లేఅవుట్, రాయంపల్లి లేఅవుట్‌లో నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలు ప్రారంభించాలని సూచించారు. హౌసింగ్ ఏఈ అశ్వర్థ, ఈఓ గౌస్‌సాహెబ్ పాల్గొన్నారు.

మదనపల్లికి వెళ్లి పింఛను అందజేత

కళ్యాణదుర్గం: అన్నమయ్య జిల్లా మదనపల్లికి వెళ్లి పింఛను అందజేశాడు ఓ వలంటీర్. మండలంలోని పాలవాయి పంచాయతీ మల్లాపురం గ్రామానికి చెందిన పి.రామాంజినేయులు పక్షపాతంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మదనపల్లిలోని బీఎస్‌ఏ మహల్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ కె.వన్నప్ప మదనపల్లికి వెళ్లి రామాంజనేయులుకు డీఎంహెచ్‌ఓ పింఛను రూ.5,000 అందించాడు. వలంటీర్‌ను పలువురు అభినందించారు.

జగనన్నతోనే రాష్ట్రానికి భవిష్యత్తు

బొమ్మనహాళ్/రాయదుర్గం రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సువర్ణపాలన సాగుతోందని, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరుతున్నాయని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామాంజినేయులు, సీనియర్ నేతలు చంద్రశేఖర్‌రెడ్డి , లోకేష్, మాజీ కన్వీనర్ ఈశ్వరరెడ్డి అన్నారు. రాష్ట్రానికి జగనన్నే ఎందుకు సీఎం కావాలి కార్యక్రమంలో భాగంగా శనివారం బొమ్మనహాళ్ మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను ప్రజలకు వివరించి చైతన్యం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంసీహెచ్ రాజ్‌కుమార్, పరమేశ్వర, మనోహర్ శెట్టి, రామకృష్ణ, ఆనంద్‌రెడ్డి, కొత్తూరు తిమ్మప్ప, అనంతరాజు, వీరన్నగౌడ్, బసవరాజు, గాధిలింగ, విశ్వనాథ్‌రెడ్డి, కోటేశ్వరరెడ్డి, వన్నూరుస్వామి, బుజ్జి, శీన, ముక్కన్న, మహేష్, సర్మస్, సుంకేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రాయదుర్గం పట్టణంలోని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి నివాసంలో శనివారం మండల కన్వీనర్ హొన్నె మల్లికార్జున నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి గత నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని వివరించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు రేకులకుంట శివారెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ మురహరి, మాజీ వైస్ ఎంపీపీ బాబులు, ఉడేగోళం పీఏసీఎస్ చైర్మన్ భీమన్న, ఎంపీటీసీలు, సర్పంచులు, సచివాలయాల కన్వీనర్లు , గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్షన్ సెంటరుతో రైతులకు లాభం



కలెక్షన్ సెంటర్ ప్రారంభిస్తున్న అధికారులు

కళ్యాణదుర్గం: ఉద్యానవన పంటల నిల్వకు నిర్మించిన కలెక్షన్ సెంటర్‌తో రైతులకు లాభాలు వరిస్తాయని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రఘునాథ్‌రెడ్డి అన్నారు. కళ్యాణదుర్గం మండలం వెంకటంపల్లి గ్రామంలో శనివారం రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆర్థిక సహకారంతో నిర్మించిన కలెక్షన్ సెంటర్‌ను నాబార్డు డీడీఎం అనురాధ, ఎకాలజీ సీఈఓ మురళీకృష్ణతో కలిసి ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యాన పంటల నిల్వ, వాషింగ్, ప్యాకింగ్, మార్కెటింగ్‌ను కలెక్షన్ సెంటర్‌లో చేసుకోవచ్చన్నారు. నాబార్డు డీడీఎం, ఏఎఫ్ ఎకాలజీ సీఈఓ మాట్లాడుతూ రాబోవు రోజుల్లో ఉత్పత్తిదారుల సభ్యుల సమావేశాలకు కలెక్షన్ సెంటర్ వేదిక అవుతుందన్నారు. 3 నెలల్లో రూ.5.50 కోట్లతో కోల్డ్ స్టోరేజ్‌ను సైతం అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో ఎకాలజీ కో ఆర్డినేటర్ భాస్కర్‌బాబు, బీఓడీ సభ్యులు, వాటాదారులు, ఏఎఫ్ ఎకాలజీ సిబ్బంది, ఎంటీఏల్‌లు, మేనేజర్లు, సీఈఓలు, ఎస్టీఓలు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ట



వాల్మీకి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

బొమ్మనహాళ్: మండలంలోని శీర్పి గ్రామంలో శనివారం వాల్మీకుల ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. జ్యోతులు, కలశాల ఊరేగింపును మంగళవాయిద్యాల నడుమ వాల్మీకి విగ్రహం వరకూ చేపట్టారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రతిష్ట హోమాలు, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు.ఈసందర్భంగా వాల్మీకి నాయకుడు ఎర్రిస్వామి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వాల్మీకి సంఘ నాయకులు, ప్రజా ప్రతినిదులు , ప్రముఖులు ప్రసంగించారు. ఐక్యతతోనే సమస్యల పరిష్కారం సాధ్యమన్నారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చేలా పార్టీలకతీతంగా వాల్మీకులందరూ పోరాడాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, సేవాసంఘ నిర్వాహకుడు డీఎస్ మూర్తి, మున్సిపల్ మాజీ చైర్మన్ రమేష్, మాజీ ఎంపీపీ వన్నూరస్వామి, సహకార సంఘ అధ్యక్షుడు శివలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

డోర్ డెలివరీపై అవగాహన కల్పించండి

ఉరవకొండ: ఆర్టీసీలో ప్రవేశపెట్టిన డోర్ డెలివరీపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని ఉరవకొండ ఇన్‌చార్జ్ డీఎం నారాయణస్వామి పిలుపునిచ్చారు. శనివారం ఆర్టీసీ డిపో ఆవరణలో డోర్ డెలివరీ మాసోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ ఉద్యోగులకు డీఎం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో కార్గో ద్వారా ప్రతిష్టాత్మకంగా డోర్ డెలివరీ కార్యక్రమం చేపట్టామన్నారు. ఎస్టీఐ ప్రసాద్, ఏఎంఎఫ్ సుబ్రమణ్యం, ఎస్‌హెచ్‌జీ రమణ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

డి హీరేహాళ్(రాయదుర్గం): డి హీరేహాళ్ మండలంలోని సోములాపురం రైల్వేస్టేషన్ వద్ద శనివారం రాత్రి కర్ణాటక రాష్ట్రం బళ్లారి తాలూక బెలగల్లు తండాకు చెందిన వినోద్‌నాయక్ (21) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఎస్‌ఐ రంగడుయాదవ్ వివరాల మేరకు.. తండ్రి నీలానాయక్ తో కలసి సొంత టిప్పర్ లో గూడ్స్ రైలు నుంచి ఐరన్‌ఓర్ లోడ్ చేసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. టిప్పర్ పైన కూర్చున్న వినోద్‌కు విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



కూడేరు: మండలంలోని చోళసముద్రానికి చెందిన ఈడిగ రాము అదృశ్యమయ్యాడు. ఈ మేరకు అతని భార్య లక్ష్మి శనివారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. 1వ తేది ఉదయం చికెన్ కబాబ్ షాపు దగ్గరకు వెళుతున్నాని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. మళ్లీ తిరిగి రాలేదని ఆమె పోలీసుకు తెలిపింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

గ్రామ కంఠం భూమిపై వివాదం

కళ్యాణదుర్గం: మండలంలోని కొండాపురంలో శనివారం రాత్రి గ్రామకంఠం భూమిపై వివాదం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు...గ్రామానికి చెందిన శ్రీనివాసుల ఆచారి సర్వే నం.209–1లో ఒకటిన్నర సెంటు దొంగ పట్టా చేయించుకున్నాడంటూ సర్పంచు త్రివేణి భర్త లాలుస్వామి, గ్రామస్తులు నిలదీశారు. శ్రీనివాసుల ఆచారి గతంలో ఆ స్థలంపై కోర్టులో స్టే తెచ్చుకున్నాడు. ఈ క్రమంలో ఆ స్థలంలో ప్రహరీ నిర్మించుకునేందుకు యత్నిస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో శ్రీనివాసుల ఆచారి పోలీసులను ఆశ్రయించాడు. రూరల్ పోలీసులు వెంటనే సర్పంచు భర్తతో పాటు పలువురు గ్రామస్తులను స్టేషన్‌కు తీసుకొచ్చారు. కోర్టు పరిధిలో ఉన్న భూమిపై వివాదం వద్దని సూచించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని పంపించారు.

8న విద్యాసంస్థల బంద్

కళ్యాణదుర్గం: రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 8న విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద శనివారం విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కడప ఉక్కు పరిశ్రమ ప్రారంభించాలని, విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించి పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హనుమంతరాయుడు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ, నాయకులు ప్రకాష్, వంశీ, సిద్దు, వరుణ్, శివమూర్తి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.